క్లుప్తంగా

ఓటు వేసిన ఈఆర్వో, ఎస్పీ



ఓటు వేసేందుకు వచ్చిన ఈఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం మంగళ, బుధవారం అవకాశం ఇవ్వడంతో కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో పలువురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రూరల్ ఈఆర్వో ఇట్ల కిశోర్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం ఓటు వేశారు.

ఓటింగ్ పెరగాలి



వేలిపై సిరా గుర్తును చూపుతున్న ఎస్పీ

కాకినాడ క్రైం: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం బ్యాలెట్ ఓటింగ్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యావంతుల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని ఆయన ఆకాంక్షించారు.

గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోళ్లు

కాకినాడ సిటీ: జిల్లాలో రబీ ధాన్యాన్ని 214 ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ మావూరి బాలసరస్వతి మంగళవారం తెలిపారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,183కు, గ్రేడ్‌–ఏ రకం రూ.2,203కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ రకం 75 కిలోల బస్తాకు రూ.1,637కు, గ్రేడ్‌–ఏ రకం 75 కిలోలకు 1,652కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది మద్దతు ధర క్వింటాకు రూ.143 అదనంగా ఇస్తున్నట్లు డీఎం తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 19443.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2,337 మంది రైతుల నుంచి రూ.42.09 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కాగా రైతులకు అమ్మిన ధాన్యానికి రూ.8.97 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. బొండాలు రకం ధాన్యాన్ని ఎక్కువగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. విక్రయించిన ధాన్యానికి 21 రోజుల్లో రైతు ఖాతాలో సొమ్ము జమచేయనున్నట్టు డీఎం తెలిపారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా కాకినాడ, జగ్గంపేట, కోనసీమలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ మంగళవారం తెలిపారు. జూన్ పదో తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థి చేరదలచుకున్న ఐటీఐ కళాశాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థులు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని, సందేహాలుంటే 0884–2348182 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సమర యోధుల త్యాగాల ఫలితమే స్వాతంత్య్రం



అల్లూరికి నివాళులర్పిస్తున్న కళావేదిక సభ్యులు

బోట్‌క్లబ్: సమర యోధుల త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్య్రానికి సాక్ష్యమని సీతారామరాజు కళావేదిక అధ్యక్షులు కర్రి అచ్యుత రామిరెడ్డి అన్నారు. విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని మంగళవారం నాగమల్లితోట జంక్షన్ అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహించి నివాళులు అర్పించారు. పారిశ్రామికవేత్తలు బీఆర్ ప్రసాదరెడ్డి, గణపతిరాజు, జోగి జగన్నాధరాజు, క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణభాస్కర రాజు, కర్రి భామిరెడ్డి తదితరులు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తూరంగిలో..

కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజుకాలనీలో మంగళవారం అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. సినీ నిర్మాత పీడీఆర్ ప్రసాద్‌రెడ్డి అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. కాలనీవాసులు చింతపల్లి అజయ్‌కుమార్, జోగా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పర్లోవపేటలో..

స్థానిక పర్లోవపేటలో మంగళవారం అల్లూరి వర్ధంతి నిర్వహించారు. ఇష్టా రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

చలివేంద్రం ప్రారంభం

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలోని జయేంద్ర నగర్‌లో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజురోజుకు వేసవి తాపం పెరిగిపోతుండడంతో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ దాసరి కేదారి తెలిపారు. నెల రోజుల పాటు చల్లని మజ్జిగను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వనిత, రాజీ, వెంకట్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాత కుదేలు

- తడిసిన ధాన్యపురాశులు
- నేలనంటిన వరిచేలు

కరప: మండల పరిధిలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి అన్నదాత కుదేలయ్యాడు. ధాన్యం రాశులు తడిసిపోయి, కోసిన చేలు పనమీద ఉండటంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో 14,413 ఎకరాల్లో రబీ సాగుచేశారు. ముందుగా నాటిన పొలాల్లో కోతలు పూర్తికాగా, ఆలస్యమైన ప్రాంతాల్లో మాసూళ్లు సాగుతున్నాయి. ఎండలు బాగా ఉండడంతో కోసిన ధాన్యం మళ్లల్లో, రోడ్డుపక్క, లే అవుట్లలో తేమశాతం పోవడానికి ఆరబెట్టుకున్నారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఆ ధాన్యం, మళ్లలోని గడ్డి తడిసిపోయింది. వర్షం తెరిపివ్వగానే కొన్ని గ్రామాల్లో



పెనుగుదురు సమీపంలో ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

రైతులు మళ్లలోని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోగలిగారు. కోయని వరిచేను నేలకంటి, ధాన్యం దెబ్బతింటుందని, కోసేటప్పుడుకూడా రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మబ్బులు, ఈదురు గాలులకు సేదతీరిన ప్రజలు మూడు వారాలుగా వేసవి తాపానికి విలవిల్లాడిన



వలసపాకలలో బరకాలతో కప్పిన ధాన్యపురాశులు

ప్రజలు మంగళవారం వర్షానికి సేదతీరారు. చల్లటి గాలులు వీచడంతో పిల్లలు బయటకువచ్చి కేరింతలు కొట్టారు. తర్వాత వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈదురు గాలులకు మామిడికాయలు రాలిపోయి, నష్టం వాటిల్లినట్టు మామిడి రైతులు అంటున్నారు.

అయినకాడికి అమ్ముకోవద్దు

రైతులకు జేడీఏ విజయ్‌కుమార్ హితవు

కరప: జిల్లాలో కురిసిన అకాల వర్షంతో కొన్ని ప్రాంతాల్లో రబీ ధాన్యం రాశులు, వరిపనలు తడిసిపోయాయని, రైతులు త్వరపడి అయినకాడికి విక్రయించవద్దని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు (జేడీఏ) ఎస్.విజయకుమార్ సూచించారు. కరప మండలం వాకాడ, వలసపాకల, పెనుగుదురు తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి అకాలవర్షానికి తడిసిన ధాన్యం రాశులు, పడిపోయిన వరిచేలను పరిశీలించి, మొలకరాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. 17 శాతం తేమ నిబంధనను సడలించి, మద్దతుధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు దూడల వీరాస్వామి, చోడిశెట్టి సత్తిబాబు తదితరులు జేడీఏను కోరారు. అనంతరం జేడీఏ రైతులతో మాట్లాడుతూ రైతులు త్వరపడి దళారులను ఆశ్రయించవద్దని, కళ్లాల్లోని ధాన్యం రాశులనుంచి నమూనాలను తీయించి, తేమశాతం పరీక్షలు చేయించారు.

ధాన్యం మొలకరాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లాలో రబీలో 66,547 హెక్టార్లలో వరి సాగుచేశారని, ఇంత వరకు 54,163 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయన్నారు. సుమారుగా 12 వేల హెక్టార్లలో పంటపై ఉందన్నారు. కోతలు అవ్వని ప్రాంతాల్లోని రైతులు రెండు, మూడు రోజులు కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన పొలాల్లో ధాన్యం మొలకరాకుండా, రంగుమారకుండా ఉండేందుకు పనమీద ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. పల్లపు ప్రాంతాల్లోని ధాన్యం రాశులను మెరక ప్రాంతానికి తరలించి, ధాన్యం మొలక రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జేడీఏ విజయకుమార్ సూచించారు. వీఏఏలు వి.ప్రశాంత్, వి.అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఓటు వేసిన 155 మంది



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ మిలిటరీ రోడ్ శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం 155 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉండి ఫారం 12/12డి ద్వారా దరఖాస్తు చేసుకోని ఉద్యోగుల సౌకర్యార్థం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా తొలిరోజు 155 మంది ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం కూడా ఈ కేంద్రం పనిచేస్తుందని, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకుని ఓటు వేయవచ్చునని సూచించారు. కమిషనర్ వెంట పలువురు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. అలాగే కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో 43 మందిని హోమ్ ఓటింగ్ కోసం గుర్తించగా, ఈ నెల ఐదో తేదీన 42 మంది ఇంటి వద్ద ఓటు వేశారు. మిగిలిన ఆ ఒక్కరూ మంగళవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో హోమ్ ఓటింగుకు ఎంపికైన వారంతా నూరు శాతం ఓటు వినియోగించుకున్నట్లయింది.

ఓటరు స్లిప్ కోసం కాల్ చేయండి

ఓటరు సమాచార స్లిప్ అందని వారి కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ ప్రగతిపై ఎన్నికల సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ నియోజకవర్గంలో 234 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. ఎక్కడైనా ఓటర్ స్లిప్పులు అందకపోతే అటువంటి ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని 0884 2349400 నెంబర్‌కు కాల్ చేస్తే పూర్తి సమాచారాన్ని అందిస్తామన్నారు. ఓటరు గుర్తింపు సంఖ్య, పోలింగ్ బూత్ నెంబర్, పోలింగ్ స్టేషన్ చిరునామా సహా అన్ని వివరాలను ఈ సెంటర్ లో తెలియజేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సెంటర్ పనిచేస్తుందని, నియోజకవర్గ ఓటర్లు అవసరమైతే ఈ కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యాయవాదులకు అండగా ఉంటా

- ఎన్నికల్లో మళ్లీ గెలిపించండి
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: న్యాయవాదుల సంక్షేమానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎల్లప్పుడు అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక బార్ అసోసియేషన్‌ను సందర్శించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని న్యాయవాదులను కోరారు. ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. సీనియర్ న్యాయవాది నక్కా వెంకట నరసింహారావు ఎమ్మెల్యే ద్వారంపూడికి స్వాగతం పలికారు. ద్వారంపూడి మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన వారికి లా నేస్తం ద్వారా ఏటా రూ.5 వేలు అందించడంతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను సీఎం అమలు చేశారన్నారు. ప్రధానంగా న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు ప్రకటించి రూ.25 కోట్లు విడుదల చేయడం ద్వారా అడ్వకేట్లకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించాలని ఆయన న్యాయవాదులను కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులతో పాటు పలువురు బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో సిటీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



ఆటో యూనియన్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

ఆటో యూనియన్ల సమావేశం

కాకినాడ నగర, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని 50 ఆటో యూనియన్ల సంయుక్త సంఘీభావ సమావేశం స్థానిక డి కన్వెన్షన్‌లో మంగళవారం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ద్వారంపూడిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేలు అందించడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆటో యజమానులకు ఎంతో మేలు చేశారన్నారు. ముఖ్యంగా పోలీస్, రవాణా అధికారులకు కేసుల లక్ష్యాలను నిర్దేశించకపోవడం వల్ల ఎంతో మంది ఆటో యజమానులు వేధింపులు లేకుండా జీవించారని పేర్కొన్నారు. ఆటో యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ 14 ఏళ్లుగా తమ యూనియన్లకు అండగా నిలిచిన ద్వారంపూడిని రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి గెలిపించుకుంటామన్నారు. ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు కర్రి వీర్రెడ్డి (చినబాబు), యూనియన్ అధ్యక్షులు నులుకుర్తి సూర్యప్రకాష్, తాతపూడి మూర్తి, ఉపాధ్యక్షుడు పలివెల విజయ్‌కుమార్, కార్యదర్శులు సవరపు నాగరాజు, నక్కా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నటుడు గౌతమ్‌రాజు ప్రచారం



ఎన్నికల ప్రచారంలో డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, హాస్యనటుడు గౌతమ్‌రాజు

కాకినాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని హాస్యనటుడు గౌతమ్‌రాజు పేర్కొన్నారు. జూన్ మొదటి వారంలో వైఎస్ జగన్ రెండోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. మంగళవారం ఆయన సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అల్లుడు డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డితో కలిసి 41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి వెంకట్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

17న కాకినాడ బార్ ఎన్నికలు

కాకినాడ లీగల్: ఈ నెల 17న కాకినాడ బార్ అసోసియేషన్‌కు 2024–25 సంవత్సరానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల సీఈవో సీనియర్ న్యాయవాది టీపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. వివిధ పదవులకు పోటీ చేయడానికి జాబితా విడుదల చేశారు. అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ, లైబ్రరీ సెక్రటరీ, కోశాధికారి, మహిళా ప్రతినిధి, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్, సీనియర్ కమిటీ మెంబర్, మహిళా కమిటీ మెంబర్, కమిటీ మెంబర్లకు ఎన్నికల్లో వారి సీనియార్టీ ప్రకారం పోటీ చేసుకోవచ్చని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామని, 10న పరిశీలన, 11వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చినట్లు చెప్పారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం లెక్కింపు, ఫలితాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ప్రయోగాత్మకంగా మాక్ పోల్



ఈవీఎంల పనితీరును మాక్ పోల్ ద్వారా పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ: రాజకీయ పార్టీల సమక్షంలో మంగళవారం మాక్ పోల్ నిర్వహించారు. స్థానిక మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో గడచిన రెండురోజులుగా కాకినాడ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి కమిషనింగ్ పూర్తి చేశారు. బ్యాలెట్, అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను ఈవీఎంలలో నిక్షిప్తం చేసి అనంతరం మంగళవారం పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ జరిగింది. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, ఇతర ఎన్నికల అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బ్రాహ్మణులను ఆదుకున్నది జగనే

- బ్రాహ్మణ ద్రోహి చంద్రబాబు
- రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకుడు జ్వాలాపురం

కరప: బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని రాజకీయంగా, సామాజికంగా ఆదుకున్నది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని దేవదాయశాఖ సలహాదారు, రాష్ట్ర బ్రాహ్మణసంఘం నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. కరపలో మంగళవారం ఆయన బ్రాహ్మణ సంఘం నాయకులతో కలసి ఎన్నికల ప్రచారానికి వచ్చారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఇప్పటివరకు ప్రభుత్వ సలహాదారులుగా ఆరుగురికి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లుగా ఆరుగురుకి అవకాశం ఇచ్చి రాజకీయంగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అర్చకులకు వంశపారంపర్య హక్కులకల్పించారని, టీటీడీ శ్రీవాణి నిధులు, దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.240 కోట్లు మంజూరుచేసి వేలాది దేవాలయాలను పునర్నిర్మించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా కరణీకం రద్దు చేయడంతో 28 మంది గుండెపోటుతో, అర్చకుల వయస్సు తగ్గించిన కారణంగా మరో 20 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. చంద్రబాబు విజయవాడలో 36 దేవాలయాలను నేలమట్టం చేస్తే, సీఎం జగన్ పునర్నిర్మించి, హిందూ దేవాలయాలపై తనకున్న భక్తిని చాటుకున్నారన్నారు. తండ్రి చనిపోతే తలనీలాలు ఇవ్వని దౌర్భాగ్యుడు చంద్రబాబుకు హిందూధర్మం, సంప్రదాయాల గురించి మాట్లాడే అర్హతలేదని శ్రీకాంత్ పేర్కొన్నారు. జగన్‌కు అధికారమిస్తే అందరి సంక్షేమ కోరతారని, అదే పదవి ఆశ ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు అధికారం ఇస్తే దోచుకోవడం, దాచుకోవడం చేస్తారని విమర్శించారు. కాకినాడలో ఈనెల 9న జరిగే బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి జిల్లాలోని బ్రాహ్మణ సామాజిక వర్గీయులందరూ తరలిరావాలని శ్రీకాంత్ కోరారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాని ఆయన పిలుపునిచ్చారు. బ్రాహ్మణ సంఘం నాయకులు గాడేపల్లి ప్రసాద్‌కుమార్ శర్మ, చివ్వాకుల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కరపలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న శ్రీకాంత్

మీవాడు కావాలా? కాలర్ పట్టేవాడు కావాలా?

- ప్రత్యర్థికీ తనకు వ్యత్యాసాన్ని వివరించి ఓటు అభ్యర్థించిన ఎమ్మెల్యే కురసాల
- శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో ఆసక్తికరంగా సాగిన ప్రచారం

కాకినాడ రూరల్: ఎన్నికలు దగ్గరపడ్డాయి.. ఓటరు తీర్పే నాయకుని ఎంపికకు కీలకమని నియోజకవర్గంలో బెదిరింపులకు పాల్పడే నాయకుడు కావాలా? అందరివాడు కావాలా? సైలెన్సర్ తీసే నాయకుడు కావాలా? సైలెంట్‌గా పనిచేసే నాయకుడు కావాలా? కాళ్లు పట్టుకుని పని చేయించే నాయకుడు కావాలా? కాలర్ పట్టుకునే నాయకుడు కావాలా? ఎవరు బెటరో మీరే తేల్చుకోవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సర్పవరం జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రూరల్ నియోజకవర్గ శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో కన్నబాబు ఓటర్లను ఆలోచింపజేసే ప్రయత్నం చేశారు. వైఎస్సార్ సీపీ తరపున పోటీలో ఉన్న తన





వైఎస్సార్ సీపీలో చేరిన యండమూరు మాజీ సర్పంచ్ జానకిరామయ్య, వాకలపూడి మహాలక్ష్మినగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలతో కురసాల కన్నబాబు. చిత్రంలో సునీల్, బోస్ తదితర నేతలు

వ్యక్తిత్వాన్ని వివరించడంతో పాటు ప్రతిపక్ష అభ్యర్థి గురించి వివరించి, వ్యత్యాసం తెలియజేశారు. సాధ్యమైతే మంచి చేయడం తనకు తెలుసునని, తాగి తిరగడం, పేకాట క్లబ్‌లు నిర్వహించడం తనకు తెలియదన్నారు. వచ్చే ఐదారు రోజులు కీలకమని, వైఎస్సార్ సీపీ విజయం కోసం అందరివాడిగా ఉన్న తనను, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ పింక్ కలర్ మిషన్‌పై ఒకటో నంబర్ వద్ద కన్నబాబుకు, వైట్ కలర్ మిషన్‌పై రెండో నంబరు వద్ద తనకు ఓటు వేసేందుకు ఫ్యాన్ గుర్తు పక్కన ఉన్న గ్రీన్ బటన్ నొక్కాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న శెట్టిబలిజ వర్గీయులు

వైఎస్సార్ సీపీలోకి చేరికలతో జోష్

సర్పవరం జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో కరప మండలం యండమూరు మాజీ సర్పంచ్, ప్రస్తుత గ్రామ ఉప సర్పంచ్ పలివెల జానకిరామయ్య వైఎస్సార్ సీపీలో చేరారు. శెట్టిబలిజ నాయకులు జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబుల ఆధ్వర్యంలో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్ సమక్షంలో చేరారు. శెట్టిబలిజలు అందరూ ఐక్యంగా వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని ఆయన పిలుపు ఇచ్చారు. అలాగే వాకలపూడి మహాలక్ష్మినగర్‌కు చెందిన పలువురు రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద వాకలపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపల్లి జగన్, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ నుంచి గొర్ల రమేష్, జి.శేషగిరి, కె.వీరబాబు, జి.సురేష్, వి.వెంకటేష్, జి.రవితేజ, రమణ, శ్రీను తదితరులు 30 మంది పార్టీలో చేరారు.

కురసాల శ్రీవిద్య, యాంకర్ శ్యామల ప్రచారం

ఎన్నికలు దగ్గరపడడంతో అభ్యర్థుల ప్రచారాలు ఊపందుకున్నాయి. అభ్యర్థులు, వారి తరపున బంధువులు, అభిమానులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, సినీ నటులు, యాంకర్లు ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు. వైఎస్సార్ సీపీ తరపున కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కురసాల కన్నబాబుకు మద్దతుగా ఆయనతో పాటు సినీ నటి, యాంకర్ శ్యామల మంగళవారం రాత్రి ఇంద్రపాలెంలో ప్రచారం చేశారు. ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, వీరబాబు, తదితరులు ఆధ్వర్యంలో కన్నబాబు, శ్యామల ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే రమణయ్యపేటలోని శ్రీపీఠం వెనుల అపార్ట్‌మెంట్ల వద్ద కన్నబాబు భార్య శ్రీవిద్య తన భర్తను గెలిపించాలని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఆమెతో పాటు ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు రేఖారెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం వాకలపూడి గ్రామంలో కన్నబాబు భార్య శ్రీవిద్య, మరదలు చైతన్య ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి జగన్, గంపల రాణి, సత్యనారాయణ, భవాని తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రపాలెంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుతో యాంకర్ శ్యామల



రమణయ్యపేటలో అపార్టుమెంట్ వాసులతో కన్నబాబుకు మద్దతుగా ప్రచారంలో కురసాల శ్రీవిద్య

సంక్షేమ సారథిని గెలిపించండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పాతర్లగడ్డ, పెనుగుదురు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

కరప: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా మంచిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. కరప మండలం పాతర్లగడ్డ, పెనుగుదురు గ్రామాల్లో మంగళవారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. పాతర్లగడ్డలో సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, మూరా అవినాష్, మద్దుల అప్పారావు, పెనుగుదురులో సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ బందారు సుజాత, బందారు వెంకటేష్, బందారు సతీష్ తదితర నాయకులతో కన్నబాబు ప్రచారం చేశారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించడం ద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు.



పెనుగుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు